

ఓటీపీ వెతలు..

పలాస ప్రభుత్వాస్పత్రిలో ఓటీపీ వెతలు తప్పడం లేదు. రోగులు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో



సైబర్ వల.. పడ్డారో విలవిల

సైబరాసురులు రెచ్చిపోతున్నారు. డేటా కాజేసి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

- 8లో



న్యూస్‌రీల్

గురుకుల పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నట్లు దుప్పలవలస బాలురు, ఎచ్చెర్ల బాలికలు పాఠశాలల ప్రిన్సిపాళ్లు బోర బుచ్చిబాబు, లక్ష్మి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర, ఐదో తరగతి ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ ఆరు నుంచి 13వ తేదీకి వాయిదా పడినట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటలు నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు గమనించాలని, హాల్ టిక్కెట్లతో పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు.

టీచర్ల సస్పెన్షన్లు రద్దు చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న టీచర్లు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారి చేపట్టిన ఉపాధ్యాయ సస్పెన్షన్‌లను వెంటనే రద్దు చేయాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ముక్త కంఠంతో డిమాండ్ చేసింది. శ్రీకాకుళంలోని ఎన్‌జీఓ సంఘ కార్యాలయంలో సోమవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా కమిటీ సమావేశం చౌదరి రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తమ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. 25న సాయంత్రం 4గంటలకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. తదుపరి కొన్ని నిరసనల అనంతరం ఏప్రిల్ 3న టెన్త్ స్పాట్ బహిష్కరించాలని నిర్ణయించారు.

నేడు శ్రీకూర్మనాథాలయ హుండీ ఆదాయం లెక్కింపు



గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథాలయ హుండీలను మంగళవారం తెరిచి ఆదాయం లెక్కించనున్నామని ఆలయ ఇన్‌చార్జి ఈఓ జి.గురునాథం ఒక ప్రకటనలో తెలిపారు. కూర్మనాథాలయంతో పాటు పాతాళ సిద్ధేశ్వర, తండ్యాలపేట అభయాంజనేయ స్వామి ఆలయ హుండీలను లెక్కించనున్నామని ఆ ప్రకటనలో తెలిపారు.

ఏడు అడుగుల వేదిక

పరిణయ ఘడియలు పదిలం చేసుకోవాలి. పెళ్లి మండపంలో ఉన్న ప్రతి క్షణం మరపురానిదిగా మిగిలిపోవాలి. ఆకాశమంత పందిరి వేయకపోయినా అద్భుతం అనేలాగైనా మండపాన్ని తీర్చిదిద్దాలి. ఈ తరహా ఆలోచనలు కొత్త ఉపాధికి పురుడు పోశాయి. పెళ్లి మండపాలు అందంగా తీర్చిదిద్దడం అనాదిగానే ఉన్నా.. సరికొత్త ఆలోచనలతో ఆహ్లాదకరంగా డిజైన్ చేసుకోవడం కొత్త ఫ్యాషన్‌గా మారింది. పెళ్లిళ్ల సీజన్‌లో ఈ డెకరేషన్లు పదివేల మందికి ఉపాధినిస్తున్నాయి. అదిరేటి సెట్టు మేమేస్తే.. అంటూ డెకరేటర్లు అదరగొట్టేస్తున్నారు.





సిద్ధం చేసిన వివాహ వేదిక


ఇచ్ఛాపురం రూరల్:

ఏడు అడుగులకు అదే వేదిక.. పెళ్లి తంతులో దానిదే అసలైన వేడుక. అదే పెళ్లి పందిరి. జిల్లాలో అధునాతన, ఆధునిక డిజైన్లలో రెడీమేడ్ పందిళ్లు, షామియానాలు అందుబాటులోకి వచ్చేశాయి. గతంలో సంప్రదాయ పద్ధతిలో పచ్చని పందిర్లకు ఉన్నంతలో పూలతో, కొబ్బరి ఆకులతో అలంకరించేవారు. మొన్నటి వరకు అలాంటి పందిళ్లకు మంచి ఆదరణ ఉండేది. కాలక్రమేణా సంపన్నుల ఆలోచనల్లో వచ్చిన మార్పులతో పూలపందిరి, మరీ సంపన్నులైతే ముత్యాల పందిర్లను వినియోగిస్తున్నారు. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్‌లో సాధారణ వర్గాల నుంచి సంపన్నుల వరకు రెడీమెడ్ పూల పందిళ్లకే ఇష్టపడుతున్నారు.

పదివేల మందికి పైగా ఉపాధి

ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో పెళ్లి పందిళ్లు వేయడంతో పాటు భోజనాలు, డెకరేషన్స్ అందించే వారికి డిమాండ్ పెరిగింది. శుభ కార్యాలకు డెకరేషన్ చేస్తూ జిల్లాలో సుమారు పదివేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు.

- ఆకట్టుకునే డిజైన్లలో పెళ్లి పందిళ్లు
- భారీ సెట్టింగులు, పూల డెకరేషన్లు
- జిల్లాలో పదివేల మందికి పైగా డెకరేటర్లకు సీజనల్ ఉపాధి



విద్యుత్ వెలుగులతో షామియానా

అందమైన అలంకరణలతో..

ఇంట్లో శుభ కార్యం ఏది జరిపినా పూలతో అలంకరణ తప్పనిసరైంది. పెళ్లికి హాజరయ్యే అతిథులు, బంధువులను ఆకట్టుకోవాలని, తాము జరిపే శుభకార్యం పదికాలాల పాటు మరచిపోకుండా ఉండాలన్న సంకల్పంతో నిర్వాహకులు ఖర్చుకు వెనకాడటం లేదు. కొందరు క్రియేటివ్ డెకరేటర్స్‌తో వివిధ డిజైన్లలో పందిళ్లు, షామియానాలు వేస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సైతం పెళ్లి పందిళ్లు, రిసెప్షన్ సెట్టింగులు అందుబాటులో ఉన్నాయి.

రూ.50వేలుతో ప్రారంభం



శుభ కార్యాలు చేసేవారు కోరుకున్న డిజైన్లలో పెళ్లి పందిళ్లు వేస్తున్నాం. ఫ్లవర్ డెకరేషన్ బట్టి పెళ్లి పందిరికి రూ.50వేలు మొదలుకొని రూ.5లక్షలు వరకు ఉన్నాయి. బరంపురం, విశాఖపట్నం, ఆనందపురం, విజయనగరం నుంచి పూలు తెప్పిస్తుంటాం.

– బల్ల ఈశ్వరరావు, లైటింగ్ అండ్ డెకరేటర్

గిరాకీ బాగుంది..



ప్రస్తుతం కొత్తకొత్త డిజైన్లలో పెళ్లి పందిరి, షామియానాలను పెళ్లి వారు కోరుకుంటున్నారు. అందుకే ఏటా మేము మార్కెట్‌లోకి వచ్చిన కొత్త డిజైన్లను కొనుగోలు చేసి కడుతుంటాం. ప్యాకేజీ బట్టి సెట్టింగ్స్ వేస్తుంటాం. ఒక్కో పెళ్లికి పందిరి, షామియానా వేయాలంటే ఐదు మంది కుర్రోళ్లు మూడు రోజుల పాటు శ్రమించాలి.

– గండుపల్లి మోహన్‌కృష్ణ, సెట్టింగ్స్ డెకరేటర్



ఆకట్టుకుంటున్న పెళ్లి మండపం

- పెద్ద చెరువు నుంచి టిప్పర్లలో వందల లోడ్ల మట్టి తరలింపు
- రాత్రి పూట అక్రమ రవాణా
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి
- జిల్లా కీలక నేత పేరు చెప్పుకుని అక్రమ దందా

దంతలో మట్టి మాఫియా



మట్టి తరలిస్తున్న టిప్పర్



సోమవారం రాత్రి చీకటిలో మట్టి తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత మండలం కోటబొమ్మాళి మండలంలోని దంత గ్రామంలో గల పెద్ద చెరువు నుంచి అక్రమంగా రాత్రి పూట మట్టి తరలిస్తున్నారు. కీలక నేత పేరు చెప్పుకుని మట్టి రవాణా చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, తరలింపు జరుగుతుండగా ఇప్పుడా అక్రమాల్లో మట్టి కూడా చేరింది. టెక్కలి నియోజకవర్గంలో ఇప్పటికే మైనింగ్ దందా నడుస్తోంది. అనుమతి లేకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని గ్రానైట్ అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా చేస్తున్నారు. పర్మిట్లతో పని లేకుండా బ్లాకులు తరలిపోతున్నాయి. ముఖ్యంగా కోటబొమ్మాళి మండలంలో మైనింగ్ మాఫియా చెలరేగిపోతోంది. ఇప్పుడు అదే మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. రాత్రిపూట పెద్ద పెద్ద చెరువులను తవ్వేసి అక్రమంగా తరలిస్తున్నారు. అందులో భాగంగా దంత గ్రామంలోనీ పెద్ద చెరువును కూడా తవ్వేసి వందల లారీల్లో తరలించేస్తున్నారు. సోమవారం రాత్రి 10గంటల సమయంలో అధిక సంఖ్యలో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా పట్టుకునే నాథుడు లేకుండా పోయారు. టిప్పర్ల ద్వారా పెద్ద చెరువు నుంచి రాత్రి పూట మట్టి తరలిస్తున్నారని స్థానికులు అటు పోలీసులకు, ఇటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో మాఫియా దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది.



చీకటిలో వెళ్తున్న టిప్పర్

టెన్త్ పరీక్ష రాస్తూ అస్వస్థతకు గురైన విద్యార్థిని



పెద్దమడి పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థిని శ్వేతకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి బాలికల సంక్షేమ వసతి గృహంలో సోమవారం పదో తరగతి పరీక్ష రాస్తున్న శ్వేత అనే విద్యార్థిని అస్వస్థతకు గురై కింద పడిపోయి స్పృహ కోల్పోయింది. నందిగాం మండలం సవరలింగుపురం గ్రామానికి చెందిన శ్వేత మెళియాపుట్టి మండలం పెద్దమడి బాలికల సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతుంది. సోమవారం గణితం పరీక్ష రాస్తూ.. కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే అక్కడ విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది సపర్యలు చేశారు. పరీక్షలకు ముందు అనారోగ్యం బారిన పడడంతో తల్లిదండ్రులు పలాసలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందజేసినట్లు విద్యార్థి తెలిపింది. నీరసంగా ఉండడంతోనే కళ్లు తిరిగాయని వైద్య సిబ్బంది తెలిపారు. సపర్యల అనంతరం ఆమె మళ్లీ పరీక్ష రాసింది.

- గ్రీవెన్స్‌కు 162 అర్జీలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈపై కలెక్టర్ ఆగ్రహం
- షోకాజ్ నోటీసు జారీ

అధికారులు రాక.. డీలా పడిన వేదిక



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సమస్యలు వివరిస్తూ..

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉన్నతాధికారులు హాజరు కాకపోవడంతో డీలా పడుతోంది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సైతం సోమవా రం ఇదే విషయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. కార్యక్రమంలో 162 వినతులు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు అర్జీలు స్వీకరించారు. అయితే కార్యక్రమానికి ఉన్నతాధికారులు రాకుండా కిందిస్థాయి సిబ్బందిని పంపించడం సరికాదని కలెక్టర్ అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ భాషా, డీఈలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఫిర్యాదు విషయమై ఎస్ఈని పిలవగా ఆయన లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఈకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు ఉన్నతాధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు. కిందిస్థాయి సిబ్బందితో సమాధానం రాదని అన్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, లావేరు, తదితర మండలాల్లో అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిపై దృష్టి సారించాలన్నారు.

వినతుల్లో కొన్ని..

- శ్రీకాకుళం నగరంలోని వంశధార క్వార్టర్స్ వెనుక తిలక్ నగర్‌లో రోడ్డు కోత పడిందని, కమ్యూనిటీ హాల్ లేదని స్థానికులు విన్నవించారు.
- శ్రీకాకుళం తుమ్మావీధి, కత్తెర వీధులో కాలువలు నిర్మించాలని స్థానికులు కోరారు. వాటర్ పైప్‌లైన్లు వేయాలని కూడా కోరారు.
- కోటబొమ్మాళి మండలం తిలారు పంచాయతీ పరిధిలోని తిలారు ఎస్సీ కాలనీకి చెందిన గుడివాడ రామారావు, గుడివాడ ప్రభావతిల కుటుంబానికి న్యాయం చేయాలని అంబేడ్కర్స్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను తదితరులు కోరారు. ఇళ్లు పాడైపోవడంతో పునర్నిర్మాణ పనులు చేపడుతుండగా స్థానికులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.
- నందిగాం మండలం బెల్లపల్లి గ్రామానికి చెందిన రోకల్ల అప్పారావు తన భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు.

ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్నారు

- కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఫిర్యాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలి నియోజకవర్గం పరిధిలో స్థానిక ప్రజా ప్రతినిధులను గౌరవించకుండా అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్.. కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు సోమవారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతాల్లోని శిలాఫలకాల్లో కేంద్ర మంత్రి, రాష్ట్రమంత్రి పేర్లు తప్ప స్థానిక ప్రజా ప్రతినిధుల పేర్లు కనిపించడం లేదని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు నిబంధనలు కాలరాస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 50 ఫిర్యాదులు



మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతి సోమవారం వచ్చే ప్రజల ఫిర్యాదులకు తక్షణ న్యాయం అందించేలా చూడాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను జూమ్ ఫోన్‌కాల్ ద్వారా ఆదేశించారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీదారుల నుంచి అందుకున్న 50 ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఎస్పీ పై విధంగా ఆదేశాలిచ్చారు.

నిశిరాత్రి విధ్వంసం



కొత్తూరు: ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వాన

- శ్రీకాకుళం, రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల
- తెగిపడిన విద్యుత్ వైర్లు, కూలిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు
- రూ.40 లక్షల వరకు విద్యుత్ శాఖకు నష్టమని అంచనా

అరసవల్లి: ఆదివారం అర్ధరాత్రి దాటాక ఉరుముల వాన జిల్లాకేంద్రంపై విరుచుకుపడింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులు, పిడుగులతో బీభత్సం సృష్టించింది. ఈ వాన దెబ్బకు జిల్లా కేంద్రం అంతా చీకటిగా మారిపోయింది. గాలుల తీవ్రత అధికంగా ఉండడంతో పలు చోట్ల భారీ చెట్లు, కొమ్మలు పడిపోవడంతో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పిడుగుల ధాటికి పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. దీంతో సోమవారం జిల్లా కేంద్రం సరిహద్దుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు చోట్ల రహదారులన్నీ స్తంభించిపోయాయి. జిల్లాలో టెక్కలి, పలాస డివిజన్‌లలో ఈ వర్షం ప్రభావం పెద్దగా లేకపోవడంతో తీర ప్రాంతాల్లో పెద్ద ప్రభావం చూపలేదు. అయితే స్థానిక డివిజన్‌లో మాత్రం విద్యుత్ శాఖకు పెద్ద నష్టమే మిగిల్చింది. ప్రధానంగా జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఇల్లిసిపురం, ఏఎస్ఎన్ కాలనీ, బొందిలీ పురం, పాలకొండ రోడ్డు, బలగ కూడలి, ఆసుపత్రి జంక్షన్, కత్తెర వీధి ఫీడర్ తదితర నగర ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం రూరల్ గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

ఆయా ప్రాంతాల్లో సుమారు 30 వరకు విద్యుత్ స్తంభాలు కూలిపోగా, పిడుగులు పడి సుమారు 16 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. దీంతో పాటు భారీ వృక్షాలు నేలకూలిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఫలితంగా విద్యుత్ శాఖకు రూ.35లక్షలు నుంచి రూ.40 లక్షల వరకు నష్టం వచ్చిందని అంచనా వేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఈఈ పైడి యోగేశ్వరరావు, టెక్నికల్ ఈఈ సురేష్‌కుమార్‌లు తెలియజేశారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పరిస్థితి

కోలుకోలేని నష్టం



చేతికి అందిన అరటి పంట ఈదురుగాలులకు నేలమట్టమైంది. ఎకరాకు సుమారు రూ. 75 వేల వరకు పెట్టుబడి పెట్టాము. ఏడాది పాటు కష్టపడి సాగు చేసిన అరటి పంట గాలులకు నేలకొరిగిపోయింది. ఎకరాకు సుమారు రూ. 2 లక్షలు వరకు నష్టపోయాం. మమ్మల్ని ఆదుకోవాలి.

– పెద్దకోట ఆనందరావు, అరటి రైతు, కొత్తూరు

కొత్తూరు అతలాకుతలం

అకాల వర్షాలు అన్నదాతకు అపార నష్టం కలిగించాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వాన పడడంతో కొత్తూరు, కర్లెమ్మ, బడిగాం, మహసింగి, సిరుసువాడ, కుంటిభద్ర, నివగాం, మెట్టూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సాగు చేస్తున్న వందలాది ఎకరాల అరటి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. గాలులకు నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని బాధిత రైతులు తోకల ధర్మారావు, భాస్కరరావు, పెద్దకోట ఆనందరావుతో పాటు పలువురు కోరుతున్నారు. ఈదురు గాలులకు మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు గ్రామాల్లో చెట్లు విరిగి పడిపోయాయి.

– కొత్తూరు



కొత్తూరు: పాలకొండ రోడ్డులో సెలూన్‌పై పడిన చెట్టు కొమ్మలు



ఎల్.ఎన్.పేట మండలం జంబాడ వద్ద తోటల్లో రాలిపోయిన మామిడి పిందెలు

శరవేగంగా పునరుద్ధరణ

అకాల వర్షాలకు శ్రీకాకుళం డివిజన్‌లో ప్రధానంగా జిల్లా కేంద్రంలోనే అత్యధిక ప్రభావం కనిపించింది. పిడుగుల ధాటికి ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోవడంతో పాటు ధ్వంసం కావడంతో విద్యుత్ సరఫరాకు బ్రేక్ పడింది. అలాగే గాలుల కారణంగా ఫ్లెక్సీలు విద్యుత్ వైర్లపై పడటంతో కూడా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సోమవారం వేకువజాము నుంచే విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆదేశాల మేరకు టెక్నికల్ ఈఈ సురేష్, ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావులు యుద్ధప్రాతిపదికన క్షేత్ర స్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు బృందంతో కలిసి ఇల్లిసిపురం, బొందిలీపురంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో సోమవారం సాయంత్రానికి దాదాపుగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో మాత్రం సోమవారం రోజంతా విద్యుత్ సరఫరా జరగలేదు. రోజంతా కాంప్లెక్స్‌లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ తీగ నుంచి మంటలు



తెగిపడిన విద్యుత్ వైరు నుంచి వెలువడుతున్న మంటలు

స్థానిక ఆదిఆంధ్ర వీధిలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వానకు విద్యుత్ తీగ తెగిపడిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. సోమవారం ఉదయం 6గంటలు సమయంలో కరెంటు రావడంతో ఒక్కసారిగా ఆ విద్యుత్ వైరు నుంచి మంటలు చెలరేగాయి. దీంతో విద్యుత్ వైరు పడిన భాగంలో ఉన్న కాగితాలు, కవర్లు మంటకు అంటుకున్నాయి. ఎవరైనా అటువైపుగా వెళ్లి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ లైన్లు సరిచేశారు.

–టెక్కలి రూరల్



శ్రీకాకుళం బొందిలీపురం ప్రధాన రహదారిలో కూలిన చెట్లను తొలగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు

హిరమండలం: మండలంలోని తంప పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన మామిడి చిన్నబాబు అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించారు. విచారణ చేపట్టాలని డీపీవోకు ఆదేశించారు. పంచాయతీకి చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను సర్పంచ్ పక్కదారి పట్టించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీస్ శాఖలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగి అయినటువంటి తన పేరును ఉప సర్పంచ్‌గా రికార్డుల్లో చూపి దుర్వినియోగం చేసినట్లు వాపోయాడు.

న్యాయం చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మి

నందిగాం: చట్టబద్ధంగా కొనుకున్న ఇంటిని ఖాళీ చేయించి, దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని మండలంలోని కొత్తగ్రహారానికి చెందిన ఏదూరు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమేశ్వరరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. 2022 మార్చి 30వ తేదీన కొత్త అగ్రహారంలో ఉన్నటువంటి ఇల్లు, ఖాళీ స్థలాన్ని పొట్నూరు ఆనందరావు, అతని సోదరులు, సోదరి తనకు అమ్మినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారని తెలియజేశారు. అప్పటినుంచి ఆ ఇంట్లోనే తాను, తన పిల్లలు, అత్తతో కలిసి ఉంటున్నానని తెలిపారు. భర్త గల్ఫ్ దేశంలో పని చేస్తున్నాడని పేర్కొన్నారు. అయితే గ్రామానికి చెందిన దుంప కృష్ణారావు మరలా ఆనందరావుతో కోటబొమ్మాళి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఇంటి నుంచి తమను వెళ్లగొట్టడానికి పలుమార్లు దాడులు చేశారని వాపోయారు. కోర్టులో కేసు నడుస్తున్నా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆడవారు, పిల్లలపై ఈ దాడులు మరింత తీవ్రంచేస్తూ దౌర్జన్యానికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంపై మంత్రి అచ్చెన్నాయుడిని కలిసినా న్యాయం జరగలేదని తెలిపారు. అనంతరం దుంప కృష్ణారావు తదితరులు ఇంట్లో సామాన్లు పగలుగొట్టి, దాడులు చేసి ఇంటి నుంచి గెంటేశారని తెలిపారు. దీంతో ప్రస్తుతం వేరే వాళ్ల ఇంట్లో తలదాచుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని, లేకుంటే ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నారు.

మృతుడు అంబకండి వాసిగా గుర్తింపు

పొందూరు: స్థానిక రైల్వేగేటు సమీపంలో ఆదివారం జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు రేగిడి ఆమదాలవలస మండలంలోని అంబకండి గ్రామానికి చెందిన బోడిసింగి వెంకటరమణ(25)గా గుర్తించినట్లు సోమవారం జీఆర్పీ ఎస్ఐ ఎస్. మధుసూదనరావు తెలిపారు. మృతుడు విజయవాడలో తాపీ పనులు చేస్తుంటాడని, వారం రోజుల క్రితం ఊరు వచ్చాడని పేర్కొన్నారు. తిరిగి మరలా విజయవాడ వెళ్లేందుకు పొందూరు రైల్వేస్టేషన్‌కు వచ్చాడన్నారు. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు తండ్రి చిన్నారావు ఫిర్యాదు చేశారన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు.

ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆల య హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ మంగళవా రం ఉదయం 8 గంటల నుంచి అనివెట్టి మండపంలోనిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రక టనలో తెలియజేశారు. ఈమేరకు నిబంధనల ప్రకా రంగ్రామపెద్దలు, ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు, ప్రధానార్చకులు సమక్షంలో హుండీ లను తెరిపించి లెక్కింపును చేపడతామని ఆయన వివరించారు.

సైబర్ వల.. పడ్డారో విలవిల..!

- తెలియని లింక్‌లపై క్లిక్ చేస్తే చిక్కులు
- డేటా కాజేసి దోచేస్తారు
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్ నిపుణులు





శ్రీకాకుళం క్రైమ్:

- జిల్లా కేంద్ర సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో ఒక వివాహిత నివాసముంటోంది. ఆమెకు ఫ్యాషన్స్‌పై మోజు ఉండడంతో ఎఫ్‌బీలో తక్కువ ధరకే సిల్క్ శారీస్ అంటూ ఆఫర్‌తో కూడిన ఒక లింక్ వస్తే క్లిక్ చేసింది. దీని కోసం ఆమె రూ.1,200 లు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసింది. అయితే కొద్దిరోజులకే వచ్చిన పార్సిల్‌లో కనీసం రూ.200 లు విలువైనా చేయని చీర రావడంతో లబోదిబోమంది.
- నగరానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. విజిల్ అప్‌డేట్స్ పేరుతో లోన్ అప్రూవ్ అంటూ ఒక మెసేజ్ అతడి సెల్‌ఫోన్‌కు వచ్చింది. డియర్.. యువర్ 25,000 లోన్ హేజ్ బీన్ అప్రూవ్ సక్సెస్‌ఫుల్లీ, చెక్ యువర్ డీటైల్స్ హియర్ అంటూ ఓ లింక్ వచ్చింది. దీంతో ఆ వ్యక్తి ఆ లింక్‌పై క్లిక్ చేసిన వెంటనే అతని అకౌంట్, ఆధార్, యూపీఐ డీటైల్స్ అన్నీ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోయాయి. అకౌంట్‌లో ఉన్న రూ.60 వేలు మాయమయ్యాయి.

ఇలా మెసేజులు, ఈ–మెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో తక్కువ అక్షరాలతోనే షార్ట్ వెబ్ లింక్‌లు పంపించి సైబర్ కేటుగాళ్లు మోసం చేస్తున్నారు. జిల్లాలో ఇటువంటి మోసాలు కోకొల్లలు. చిన్నవిగా వచ్చే ఈ లింక్‌లపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

డేటా చోరీ

వాస్తవానికి పెద్దవిగా, గజిబిజి అక్షరాలతో ఉండే వెబ్‌లింక్‌లను చిన్నవిగా షార్ట్ లింక్‌ల మాదిరిగా చేసి ఎవరికైనా పంపే ఆప్షన్లు ఇప్పుడొచ్చేసాయి. దీంతో దీనినే ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు ఏమార్చుతున్నారు. షార్ట్‌లింక్స్‌లో మాల్వేర్‌లను పంపి వైరస్‌లను వ్యాప్తి చేస్తున్నారు. దీనిద్వారా మన ఫోన్ లేదంటే కంప్యూటర్‌లో ఉన్న పర్సనల్ డేటా హ్యాక్ చేస్తారు. ఈ–మెయిల్ ద్వారా వచ్చే లింక్ క్లిక్ చేస్తే ఫేక్ వెబ్‌సైట్ ఓపెన్ అయ్యి తెలియక మన వివరాలన్నీ ఎంటర్ చేసేస్తాం. హ్యాకర్లు ఈ లింక్‌లతో మన సిస్టమ్‌ను వారి కంట్రోల్‌లోకి తీసుకుని క్రిప్టో మైనింగ్ ద్వారా డబ్బులు దోచేస్తారు.

గుర్తుంచుకోండి

- సెల్‌ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, వాట్సాప్, ఈ–మెయిల్‌కు వచ్చే లింకుల్లో ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టాలి.
- తెలియని లింక్‌లు క్లిక్ చేయకూడదు. ఒక వేళ తెలియక క్లిక్ చేసినా డబ్బులు పంపించకూడదు.
- ఓటీపీ, నెట్ బ్యాంకింగ్, యూపీఐ పిన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ వేరే సైట్స్‌లో ఎంటర్ చేయరాదు.
- తెలియని క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేయరాదు.
- క్రెడిట్ కార్డులో నగదు పెంచేందుకు గడువు ఒక్కరోజే ఉంది. ఓటీపీ చెబితే వెంటనే అప్‌డేట్ చేస్తామంటారు. ఇలాంటివి నమ్మవద్దు.
- మీరు ఆన్‌లైన్‌లో కొన్న వస్తువుకు గిఫ్ట్ వచ్చింది. అడ్రస్ చెబితే ఇంటికి పంపిస్తామని ఫేక్ కాల్ సెంటర్ నుంచి ఫోన్ వస్తుంది. చిరునామా గానీ, బ్యాంకు ఖాతా వివరాలు కానీ ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వరాదు.
- ఎవరైనా పైన పేర్కొన్న సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి. లేదంటే https://www.cybercrime. gov.inలో ఫిర్యాదు చేయాలి. మీ పరిధిలో ఉండే పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. సంబంధిత బ్యాంకువారిని మోసపోయిన గంటలోనే సంప్రదించాలి.

హలో అంటూ అందినకాడికి..

వేసవి సమీపిస్తుండడంతో మన ఇంట్లో ఉపయోగించే ఏసీ, ఫ్రిజ్, టీవీల వంటివి రిపేర్ అవుతుంటాయి. అలాంటి సమయంలో కస్టమర్ కేర్ నంబర్ కోసం నెట్‌లో వెదికితే అవే కంపెనీల పేరిట ఫేక్ కాల్ సెంటర్ల నుంచి సైబర్ ఫ్రాడ్స్ ఎరవేస్తారు. టెలీ కాలర్స్‌లా మాట్లాడి బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డ్ డీటైల్స్, ఓటీపీ, యూపీఐ పిన్ అడుగుతారు. ఎన్నో ప్రముఖ కంపెనీల పేరిట పుట్ట గొడుగుల్లా ఫేక్ కస్టమర్ కేర్ సెంటర్లు నడుస్తుండడం, ఇంటర్నెట్‌లో దర్శనమిస్తుండడంతో మోసపోయే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే యువత కాల్ సెంటర్లలో డబ్బులు ఎక్కువగా వస్తాయని ఆశించి, టెలీ కాలర్స్‌గా చేరితే తీరా అవి మోసపూరితమైనవని తెలిశాక అవాక్కవుతున్నారు.

బెట్టింగ్‌లకు పాల్పడవద్దు

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైమ్: ఐపీఎల్ మ్యాచ్‌లు ప్రారంభమైన నేపథ్యంలో యువత బెట్టింగ్‌లకు పాల్పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని, మ్యాచ్‌లను వినోద ప్రక్రియలో చూడాలి తప్ప కుటుంబంలో విషాదం నింపేదిగా ఉండరాదన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల జోలికి పోకూడదని సూచించారు. బెట్టింగ్‌లో ఒకసారి ఆదాయమొచ్చినట్లు అనిపించినా, పలుమార్లు నష్టపోవడం జరుగుతుందన్నారు. నష్టాలను భర్తీ చేసేందుకు, అప్పులు తీర్చేందుకు నేర ప్రవృత్తిని ఎంచుకుంటున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంపులుగా కూర్చొని సెల్ చూస్తూ బెట్టింగ్‌లకు పాల్పడినా, బెట్టింగ్‌లను నిర్వహించినా ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బెట్టింగ్‌లకు పాల్పడినట్లు సమాచారముంటే డయల్ 112/100కు లేదా సంబంధిత పరిధి పోలీసులకు తెలపాలని కోరారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఓటీపీ.. వెతలు



క్యూలో ఉన్న రోగులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఓపీ కోసం రోగులకు వెతలు తప్పడం లేదు. రోగి ఎటువంటి పరిస్థితిలో ఉన్నా సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీని చెబితేనే ఓపీ చీటి ఇస్తున్నారు. దీంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదువు రాని, మారుమూల పల్లెలు నుంచి సెల్‌ఫోన్ లేకుండా వస్తున్న రోగులను పక్కకు జరిగి ఉండాలని చెబుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు 200–300 వరకు నమోదయ్యే ఓపీలు, ఒక్కసారిగా 90–100 లోపునకు మాత్రమే నమోదు అవుతుండడంతో అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనారోగ్యంతో ఆస్పత్రి వస్తున్నవారికి ఓపీ చీటీ కోసం క్యూలైన్ లేకుండా సులభతరం చేయాలని, సెల్‌ఫోన్ లేకపోయినా వైద్య సేవలు సక్రమంగా అందేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.





ఓటీపీల కోసం తంటాలు పడుతున్న సిబ్బంది, రోగులు

నిఘా నడుమ టెన్త్ పరీక్షలు



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు అధికారుల నిఘా నడుమ కొనసాగుతున్నాయి. ఇటీవల కుప్పిలి మోడల్ స్కూల్ కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 149 పరీక్ష కేంద్రాల్లో జరిగిన మ్యాథ్స్ పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు కలిపి 28,584మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 28,384 మంది పరీక్షకు హాజరయ్యారు. వివిధ కారణాలతో 199 మంది గైర్హాజరయ్యారు. సోమవారం మ్యాథ్స్ పరీక్షలో ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని డీఈఓ స్పష్టం చేశారు. జిల్లా పరిశీలకులు మస్తానయ్య కుప్పిలి మోడల్ స్కూల్ ఏ, బీ కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏర్పాట్లు, సౌకర్యాలతో పాటు పరీక్షలు జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. డీఈవో డాక్టర్ తిరుమలచైతన్య జలుమూరు, సారవకోట మండల పరిధిలోని పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

కుప్పిలిలో ప్రశాంతం

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో సోమవారం 10వ తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గణితం పరీక్షను రాష్ట్ర పరిశీలకులు, మస్తానయ్య, మండల విద్యా శాఖ అధికారి కె.పున్నయ్య పరీక్ష పరిశీలించారు. ఏ, బీ పరీక్ష కేంద్రాల్లో 9 గదుల్లో 425 మంది పరీక్ష రాస్తున్నారు. పరీక్ష నిర్వహణ విధుల్లో ఉన్న ఇన్విజిలేటర్లు, కస్టోడియన్ కం సిట్టింగ్ స్క్వాడ్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు 21 మందిని మార్పు చేశారు.

సిట్టింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించిన డీఈఓ

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన 10వ తరగతి లెక్కలు పరీక్షకు సిట్టింగ్ స్క్వాడ్‌గా డీఈఓ తిరుమల చైతన్య వ్యవహరించారు. ఇక్కడ పరీక్షలు జరుగుతున్న విధానంపై అనుమానం రావడంతో పాటు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన పరీక్ష కేంద్రాన్ని తొలుత పరిశీలించి అనంతరం పరీక్ష ముగిసే వరకు అక్కడే ఉన్నారు. 10వ తరగతి పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చాలా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు



పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్‌వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) రేపటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించే మూడు విభాగాల పోస్టులకు సంబంధించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణపై జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సోమవారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు రవాణా సౌకర్యం కల్పించి, ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు షిఫ్ట్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు షిఫ్ట్–2లు పరీక్షా సమయంగా నిర్ణయించామన్నారు. పరీక్షకు అరగంట ముందుగా గేట్లు మూసివేస్తామని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. సమావేశంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, ఏపీపీఎస్సీ ప్రతినిధులు ఈశ్వరి, పద్మప్రియ, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి టీవీ బాలకృష్ణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపుల ఐక్యతను చాటిచెప్పాలి



మాట్లాడుతున్న తూర్పుకాపు కుల సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో తూర్పుకాపుల ఐక్యతను చాటిచెప్పాల్సిన అవసరం ఉందని జిల్లా తూర్పుకాపు సామాజికవర్గం ప్రతినిధులు సురంగి మోహనరావు, దోల జగన్మోహన్, లంక గాంధీ, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావులు అన్నారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో తూర్పుకాపుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ముందుగా తూర్పు కాపు జాతి ఐక్యత చైతన్య సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన తూర్పుకాపులు నేడు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 38 మండలాల్లో జాతి ఐక్యత చైతన్య సదస్సులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా స్కిల్ డవలప్‌మెంట్ అథారిటీ సారథ్యంలో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. త్వరలో దీనికి సంబంధించిన టూర్ ప్రోగ్రాం విడుదల చేస్తామన్నారు.

పరిహారం ఇవ్వకపోవడం దారుణం

వంశధార ప్రాజెక్టు రెండో దశ నిర్మాణం వలన దెబ్బతిన్న నిర్వాసితులకు ఇంతవరకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అర్హులైన నిర్వాసితులకు గత ప్రభుత్వం పెంచిన పరిహారాన్ని సత్వరమే అందించి ఆదుకోవాలని కోరారు. నిర్వాసితులకు కేటాయించిన కొత్తూరు మండలం గూనభద్ర కాలనీ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించాలని తీర్మానించారు. హిరమండలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. తూర్పు కాపు సామాజికవర్గం భవన నిర్మాణానికి విరాళాలు ప్రకటించిన దాతలు వెంటనే కమిటీ ప్రతినిధులకు అందజేయాలని, చిరకాల స్వప్నం కాపు భవన్ నిర్మాణం త్వరలో సాకారం కాబోతుందన్నారు. లావేరు మండలం నుంచి తూర్పు కాపు చైతన్య యాత్రలు ప్రారంభమవుతాయని, అదేవిధంగా భవనం నిర్మాణానికి సంబంధించి విరాళాల సేకరణ కూడా పునఃప్రారంభమవుతుందన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల వారు విరివిగా విరాళాలు అందించాలని కోరారు. సమావేశంలో శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ప్రతినిధులు దోల తిరుమలరావు, పొగిరి సుగుణాకరరావు, కిల్లారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, పదాల తమ్మునాయుడు, వాళ్ల శ్రీరాములునాయుడు, రౌతు గోపి, సురవరం పార్వతీ, గెడ్డాపు రాజేంద్ర ప్రసాద్, ఎస్.సత్యనారాయణ, పిసిని వసంతరావు, కురిటి దుర్గారావు, డాక్టర్ చందక రామకృష్ణ, శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు పల్లి సురేష్, పాండ్రంకి రమేష్ నాయుడు, దోల బాలమురళీకృష్ణ, ఎం.శంకర్‌నారాయణ, నేతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

● మా.. ఊరికి రండి..!



విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో 1990లో చదువుకున్న విద్యార్థులంతా, మూడున్నర దశాబ్దాల తర్వాత మరలా మెడికల్ కళాశాలలో కలుసుకొని గత స్మృతులను ఒకరితో ఒకరు పంచుకున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, డాక్టర్ హర్షవల్లి నేతృత్వంలో మా ఊరికి రండి పేరిట పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం వైభవంగా జరిగింది. రోజంతా ఆనందోత్సాహాల నడుమ గడిపిన వైద్యులంతా, ప్రజలకు మరింత వైద్య సేవలు అందజేసేందుకు వినూత్న ఆలోచనలు చేశారు. వైద్య రంగంలో ప్రజా ఆరోగ్య సమస్యలను రూపుమాపేందుకు ప్రతిజ్ఞ చేశారు. –శ్రీకాకుళం అర్బన్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కంచిలి: మండలంలోని జాడుపూడి కాలనీ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న కారు, రోడ్డు క్రాస్ చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బురదపాడు గ్రామానికి చెందిన కప్పల జగదీష్ రెడ్డి అనే యువకుడు ఆదివారం కొల్లూరు గ్రామానికి వెళ్లాడు. అనంతరం అతను జాడుపూడి వద్ద భోళా శంకర్ దాబాకు ఆదివారం రాత్రి డిన్నర్‌కు వచ్చాడు. డిన్నర్ పూర్తి చేసుకొని తన బైక్ మీద జాడుపూడి కాలనీ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా, ఇచ్ఛాపురం నుంచి కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కప్పల జగదీష్ రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని 108 అంబులెన్స్‌లో ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం వేకువజామున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో పాల్గొన్న డప్పు కళాకారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డప్పు కళాకారులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, డప్పు కళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిపురం గురువులు, గొర్లె రవి డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో జిల్లాస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డప్పు ప్రాచీన కాలం నుంచి సమాజాన్ని చైతన్య పరుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో డప్పు కళాకారులు ఉన్నారని, ప్రధానంగా వీరంతా తరతరాలుగా డప్పు కళను వృత్తిగా చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం రూ.7 వేల పెన్షన్, గుర్తింపు కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. 2014 టీడీపీలో పెన్షన్లు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మరలా సర్వే పేరుతో పెన్షన్లు తొలగించే ప్రక్రియ ప్రారంభించడం సరికాదన్నారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు యథావిధిగా కొనసాగించాలని, కొత్త పెన్షన్లు ఇవ్వాలని విన్నవించారు. అధికారంలోకి వచ్చి సుమారు 10 నెలలు కావస్తున్నా ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమన్నారు. సమావేశంలో ఆరవ డిల్లీ, బాలు, దమ్ము కృష్ణ, బోనేల రామయ్య, సవాలపురపు అప్పన్న, కాళ్ల అప్పారావు, గెడ్డపు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో యువకుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి తరలిస్తూ ఒక యువకుడు సోమవారం పట్టుబడినట్లు సీఐ సూర్యనారాయణ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్, సబరాపల్లికి చెందిన అమద్ ఆనంద్ సోమవారం ఉదయం 10 గంటలకు గంజాయితో పట్టుబడ్డాడు. స్వగ్రామం నుంచి పలాస రైల్వేస్టేషన్ వరకు తరలించేందుకు రూ.3 వేలకు ఒప్పందం కుదుర్చుకుని, పలాస రైల్వేస్టేషన్ రన్నింగ్ రూం పక్కరోడ్డులో నడుచుకుంటూ స్టేషన్‌లోకి వచ్చే సమయంలో పోలీసులను చూసి రెండు బ్యాగులు వదిలి ఇద్దరు వ్యక్తులు పరుగులు పెట్టారు. దీంతో పోలీసులు వెంబడించగా నిఖిల్ పాని తప్పించుకోగా, అమద్ అనంద్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్దనుంచి 21.7 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అమ్మకందారులు, మధ్యవర్తులు మరో ఇద్దరు ఉన్నట్లు తెలిపారు.

దుప్పలపాడులో చోరీ



ఇంట్లోని బీరువా తెరిచి ఉన్న దృశ్యం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం అల్లు మహేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అల్లు మహేశ్వరరావు, అతని భార్య లక్ష్మి ఇరువురు తమ ఇంటికి తాళం వేసి ఉదయం కూలి పనులకు వెళ్లిపోయారు. వారు సాయంత్రం తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుపడ్డారు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించారు. కష్టపడి సంపాదించి కూడబెట్టుకున్న నగదుతో పాటు సుమారు 10 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు కోటబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వి.సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు.